సాక్షి
కుమురం భీం

ఆదివారం । 21 । జనవరి । 2024



ముగిసిన ఐఎస్ఎల్ పోటీలు
ఉట్నూర్‌లో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న ఐఎస్ఎల్ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు ప్రజాప్రతినిధులు, అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. 8లో▸



'తపాలా'లో వసూళ్ల పర్వం!
పత్తి విక్రయించిన రైతులకు పోస్టల్ ఖాతాలో డబ్బులు జమవుతున్నాయి. డబ్బులను బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేసేందుకు తపాలా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /19.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తగ్గుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అయోధ్య అక్షింతల పంపిణీ



కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి అక్షింతలు, ఫొటోలు ఇస్తున్న కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్: అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆసిఫాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్‌కు అయోధ్య అక్షింతలు, ఫొటోలు అందజేశారు. ఈ నెల 22వ తేదీన జన్కాపూర్ రామాలయంలో నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. జెడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, సంయోజక్ ఇరుకుల్ల ఆంజనేయులు, సహ సంయోజక్ గుర్రాల వెంకటేశ్వర్లు, కొడిప్యాక వేణుగోపాల్, గుండేటి కోటేశ్వర్‌రావు, రాజేశ్వర్, గంధం శ్రీనివాస్, జంజిరాల శ్రీనివాస్, అనుమాండ్ల శ్రీకాంత్, నల్లగొండ శ్రీరాములు పాల్గొన్నారు.

సమావేశానికి అధికారులు హాజరు కావాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు ఓటరు జాబితా పరిశీలకులుగా నియమించబడిన ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి భరత్ లక్‌పతి నాయక్ ఆదివారం మంచిర్యాల కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమావేశానికి జిల్లాలోని అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు హాజరు కానున్న నేపథ్యంలో జిల్లాకు చెందిన అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో

ఆసిఫాబాద్‌రూరల్: నవోదయ విద్యాలయంలో ప్రవేశం కోసం నిర్వహించిన అర్హత పరీక్ష శనివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. జిల్లాలోని కాగజ్‌నగర్‌లో రెండు, సిర్పూర్(టీ)లో ఒకటి, ఆసిఫాబాద్‌లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1,079 మంది విద్యార్థులకు 850 మంది హాజరు కాగా 229 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. డీఈవో అశోక్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 22 పరీక్ష కేంద్రాల్లో 4,458 మంది విద్యార్థులకు 3,658 మంది హాజరు కాగా 800 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. 82.05 హాజరు శాతం నమోదైనట్లు వివరించారు.

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



మాజీ ఎమ్మెల్యే కోనప్పతో కౌన్సిలర్లు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. గత డిసెంబర్ 20న బీఆర్ఎస్‌కు చెందిన 24 మంది కౌన్సిలర్లు వీరిపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఆర్డీవో సురేశ్‌కు తీర్మాన ప్రతి అందజేశారు. శనివారం ఉదయం 11.30 గంటలకు హాజరుకావాలని 30 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులు, ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు అధికారులు అవిశ్వాస తీర్మాన నోటీసులు జారీ చేశారు. ఈమేరకు శనివారం ఆర్డీవో సురేశ్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్‌చైర్మన్ గిరీశ్‌కుమార్‌పై అవిశ్వాసానికి 23 మంది కౌన్సిలర్లు హాజరు కాగా 21 మంది మద్దతు పలికారు. దీంతో అవిశ్వాసం నెగ్గింది. నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో నిర్వహిస్తామని ఆర్డీవో తెలిపారు. అనంతరం కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఏవో ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఝురి(కలశం)కి పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు(ఫైల్)



నాగోబా విగ్రహం



సిరికొండ కుండలకు పూజలు చేస్తున్న కటోడ కితవారు (ఫైల్)



నైవేద్యాలు తయారు చేస్తున్న... (ఫైల్)

పూజాంకితులు

సండే స్పెషల్

- నాగోబా స్మరణలో మెస్రం వంశీయులు
- మహాపూజకు సన్నద్ధం • నేటి నుంచే గంగాజల సేకరణ యాత్ర

ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు సమయం ఆసన్నమైంది. ఆదివాసీల ఆరాధ్యదైవం ఆశీస్సుల కోసం మెస్రం వంశీయులు సిద్ధమవుతున్నారు. పుష్యమాస అమవాస్య పురస్కరించుకొని ఫిబ్రవరి 9న కేస్లాపూర్ ఆలయంలో మహాపూజకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇందులో భాగంగా ఈనెల 14న ప్రారంభించిన ప్రచార యాత్ర శనివారంతో కేస్లాపూర్ వద్ద ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని 22 కితల వారు ఆదివారం ఇక్కడికి చేరుకుంటారు. అనంతరం పవిత్ర గంగాజల సేకరణ యాత్రకు బయల్దేరుతారు.

మహాకార్యంలో భాగస్వాములవుతూ..
రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతరలో మెస్రం వంశీయుల పూజలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ పర్యవేక్షణలో 22 కితల వారు తమకు కేటాయించిన బాధ్యతలు నిర్వహిస్తారు. ఇందులో పటేల్, కటోడ, గాయికి, జాడియల్, నాయక్‌వాడి, సాంకేపాయిలాల్, ఎంపాలియల్, వాడే, సపాలి, ప్రధాన్, బేజిలికర్, హవాల్దార్, డివేకర్, ఎవితి, కోర్కార్, డప్, డాకలి, రంకం, బండే, బొడ్డిగూడియల్, గారుడి, కాంటేలకార్ కితలు ఉంటాయి. జాతర ప్రారంభం నుంచి మహాపూజ ముగింపు వరకు వీరంతా ఆలయ సమీపంలోని ప్రత్యేక గుడారాల్లో బస చేస్తూ మహాకార్యంలో భాగస్వాములవుతారు.

పటేల్..: మహాపూజతోపాటు కార్యక్రమాలన్నీ ఈయన ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. ప్రస్తుతం వెంకట్‌రావ్ ఆలయ పీఠాధిపతిగా కొనసాగుతున్నారు.

కటోడా..: ప్రతీ పూజను ఈ కితకు చెందిన వారే నిర్వహిస్తారు. ప్రధాన ఘట్టమైన మహాపూజతోపాటు ఉట్నూర్ మండలం బుడుందేవ్ పూజలు ముగిసే వరకు వీరిదే కీలక పాత్ర.

గాయికి, జాడియల్..: ఈ రెండు కితలకు చెందిన వారు గోదావరి నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగాజలంతోపాటు ఝురి(కలశం)కు రక్షణగా ఉంటారు.

నాయక్‌వాడి..: మహాపూజ ప్రారంభం నుంచి ముగింపు వరకు కావాల్సిన నైవేద్యాల తయారీ బాధ్యత వీరిదే.

ప్రధాన్(పటడి): వీరు సంప్రదాయ పూజా కార్యక్రమాల్లో డోల్, పిప్రి, కిక్రి, కాలికోం వాయిద్యాలు వాయించడంతోపాటు నాగోబా, మెస్రం వంశీయుల చరిత్రను బోధిస్తారు.

జోపల్.: ఈ కితకు చెందిన వారు గోవడ్ మాలిక్‌గా వ్యవహరిస్తారు.

వాడే..: వీరు నైవేద్యం తయారీకి అవసరమైన పాత్రలను కట్టెతో తయారు చేసి అందిస్తారు.

ఎవితి.. : మహాపూజ మరుసటి రోజు నాగోబా ఆలయం వెనుక ఉన్న సతి దేవత పూజలను వీరు చేపడతారు.

సపలి..: మహా పూజలో భాగంగా గౌరపూర్ గ్రామంలో ఉన్న పశువుల దొడ్డికి పూజలు చేసే బాధ్యతను వీరు నిర్వర్తిస్తారు.

మిగతా కితలకు చెందిన వారు సంప్రదాయ పూజా కార్యక్రమాల్లో వీరికి సహాయ, సహకారాలు అందిస్తారు.



సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తున్న ప్రధాన్ (పటడి)కితకు చెందిన వారు (ఫైల్)

ఆచారం పాటిస్తున్నాం

నాగోబా జాతరలో భాగంగా తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తున్నాం. మహాపూజ అంకురార్పణ నుంచి ముగింపు వరకు 22 కితల వారు భాగస్వాములవుతారు. ఒక్కో కితకు ప్రత్యేక బాధ్యతలుంటాయి. అందరి సలహాలు, సూచనలతో సమన్వయంతో వ్యవహరిస్తూ సంప్రదాయ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటాం. మహత్కార్యాన్ని విజయవంతం చేస్తాం.

– మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ పీఠాధిపతి, పటేల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై నిర్వహించిన స్మార్ట్ యోధా మహిళా స్వశక్తి కార్యక్రమంలో ఆదిలాబాద్ మహిళా స్వశక్తి సమన్వయకర్త మాధవితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు నిత్య జీవితంలో ఎన్నో రకాల లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, వరకట్న వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంజేశారు. ప్రతీ మహిళ గుండె నిబ్బరంతో ఎలాంటి పరిణామాలనైనా మనోధైర్యంతో ఎదుర్కొనేలా సన్నద్ధమవ్వాలని సూచించారు. సమాజంలో బాలికలు, మహిళలు, ఉద్యోగినులు ఎదుర్కొంటున్న వేధింపులపై జిల్లా కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు లఘుచిత్రం ప్రదర్శించారు. జిల్లా సంక్షేమాధికారి సావిత్రి, డీఈవో అశోక్, షీటీం సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాణి

కెరమెరి(ఆసిఫాబాద్): మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా జెండర్ స్పెషలిస్ట్ రాణి సూచించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, భర్త, అత్తింటి వేధింపులకు గురయ్యే మహిళలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైనవారు హెల్ప్‌లైన్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించకోవడం చట్టరీత్యా నేరమని చెప్పారు. బాల్యావివాహాలు జరగకుండా చూడాలని సూచించారు. ఆర్థిక నిపుణుడు సాగర్, ఏపీఎం జగదీశ్వర్, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు రాధ తదితరులున్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

- రామమందిరం చూసేందుకు అవకాశం
- మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్స్
- నెల రోజులపాటు అందుబాటులో మూడు రైళ్లు



ప్రత్యేక రైళ్లు ఇవే

- సికింద్రాబాద్–అయోధ్యధామ్–సికింద్రాబాద్
- కాజీపేట–అయోధ్యధామ్–కాజీపేట
- జల్నా–అయోధ్యధామ్–జల్నా (ఫిబ్రవరి 2, 7 మాత్రమే)

రైళ్లు నడిచే తేదీలు: ఈ నెల 29నుంచి మార్చి 2వరకు (రెండు వైపులా కలిపి)

బయలుదేరు సమయం	చేరుకునే సమయం
మంచిర్యాల రాత్రి 8.18గంటలకు..	సిర్పూర్ కాగజ్‌నగర్ సాయంత్రం 5.03గంటలకు
బెల్లంపల్లి రాత్రి 8.48గంటలకు..	బెల్లంపల్లి సాయంత్రం 5.38గంటలకు
సిర్పూర్ కాగజ్‌నగర్ రాత్రి 9.28గంటలకు..	మంచిర్యాల రాత్రి 6.08గంటలకు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అయోధ్యకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ 'ఆస్తా ప్రత్యేక రైళ్ల'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 22న అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరం ప్రారంభోత్సవం, బాల రాముడికి ప్రాణప్రతిష్ఠ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా భక్తులు వెళ్లి దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. రామమందిర ప్రారంభోత్సవ ఘట్టానికి సాధారణ ప్రజలకు ఆహ్వానం లేదు. ఆ తర్వాత భక్తులు మందిరాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు నెల రోజులపాటు ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిసర ప్రాంత ప్రజల కోసం మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ల నుంచి వెళ్లేందుకు ప్రత్యేకంగా మూడు రైళ్లు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో సికింద్రాబాద్ నుంచి నడిచే రైలు 16 ట్రిప్పులు, కాజీపేట నుంచి నడిచే రైలు 15 ట్రిప్పులు, జల్నా (మహారాష్ట్ర) నుంచి నడిచే రైలు రెండేసి చొప్పున అయోధ్యకు ట్రిప్పులు నడవనున్నాయి. వీటిలో రెండు రైళ్లు కాజీపేట మీదుగా, జల్నా రైలు మాత్రం కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల మీదుగా రాకపోకలు సాగించనున్నాయి.

ప్రయాణికులకు ఊరట
దేశ వ్యాప్తంగా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న రామమందిర ప్రారంభోత్సవం క్రతువులో జిల్లా వాసులు కూడా పాలు పంచుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ముఖ్యులకు బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు హాజరు కావాలని ఆహ్వానాలు అందాయి. ఇక సామాన్యులు కూడా వీక్షించేందుకు అయోధ్య వెళ్లాలంటే రోడ్డు మార్గంలో దూరభారం, ప్రయాణ ఖర్చులు అధికంగా ఉంటాయి. రైలు మార్గంలో కొంత సౌకర్యంగా ఉంటుంది. ఈ క్రమంలో ప్రత్యేక రైళ్ల ఏర్పాటుతో సామాన్యులకు ఊరట కలుగుతోంది. జనరల్, స్లీపర్, ఏసీ క్లాస్‌లో ప్రయాణికులు ఆ మేరకు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైళ్లు రామమందిరం ప్రారంభోత్సవ సందర్భంగా మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. మిగతా రోజుల్లో మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల నుంచి ఈ మార్గంలో రైళ్లు అందుబాటులో ఉండవు.

సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల పరిసర ప్రాంతాల నుంచి అయోధ్యకు వెళ్లేందుకు సామాన్యుల కోసం ప్రత్యేక ట్రైన్లు నడుస్తున్నాయి. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– వీ రవికుమార్, రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, మంచిర్యాల

సర్వే సమాప్తం

- బడిబయటి పిల్లలు 725 మంది
- సర్వే చేసి గుర్తించిన అధికారులు
- సమీప పాఠశాలల్లో అడ్మిషన్లు
- ప్రతిఒక్కరూ చదవాలనే లక్ష్యంతోనే..



ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో బడిబయటి చిన్నారులపై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం యూడైస్ కోడ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. దేశంలోని ఒక్కో విద్యార్థికి ఒక కోడ్ కేటాయించింది. ఈ విధానంతో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంతమంది పిల్లలు చదువుకోకుండా బయటకు వెళ్తున్నారని గుర్తించాలని నిర్ణయించింది. ప్రత్యేక సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో అధికారులు రంగంలోకి దిగి మూడు వారాలపాటు ప్రత్యేక సర్వే చేపట్టారు. జిల్లాలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించారు.

డిసెంబర్ 11 నుంచి సర్వే..
జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బడిబయటి పిల్లలను గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవుట్ సైడ్ స్కూల్ స్టూడెంట్స్ పేరుతో చేపట్టిన ప్రత్యేక సర్వే గత నెల 11న మొదలై ఈనెల 17వ తేదీతో ముగిసింది. ఈ సర్వేలో 5–14 ఏళ్లున్న బడిబయటి పిల్లలను ఎలిమెంటరీ స్థాయిగా గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలల్లో వయస్సుకు తగిన తరగతిలో చేర్పించారు. 15–19 ఏళ్లుండి బడి మానేసిన పిల్లలను గుర్తించి సమీప సార్వత్రిక పాఠశాలల్లో పేర్లు నమోదు చేశారు. ఈ సర్వేను జిల్లాలోని 53మంది స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు వారి పరిధిలోని మండలాలు, గ్రామాలు ఆవాస ప్రాంతాల్లో చేపట్టారు. ప్రతిరోజూ ఒకటి లేదా రెండు ఆవాస ప్రాంతాల్లో కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్ (సీఆర్పీ)లు ఇంటింటికీ తిరిగారు. ఇప్పటివరకు గుర్తించిన విద్యార్థులతో పాటు బడిబయట మరికొంత మంది ఉన్నట్లు గుర్తించారు. ఈ సర్వేను మళ్లీ చేపట్టేలా తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు, మండల విద్యాధికారులు ఈ సర్వేలో పాల్గొని పర్యవేక్షించారు. జిల్లా సంక్షేమాధికారి, జిల్లా కార్మికశాఖ అధికారి, పోలీసు అధికారుల సహకారం తీసుకున్న అధికారులు సర్వే పూర్తి చేశారు.

725 మంది గుర్తింపు
జిల్లాలో 15 మండలాలుండగా 335 గ్రామపంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల చుట్టూ ఉన్న గ్రామాల్లోని విద్యార్థులు, పొరుగు రాష్ట్రం నుంచి తల్లిదండ్రులతో ఉపాధి నిమిత్తం వచ్చిన బాలబాలికలపై విద్యాశాఖ దృష్టి సారించింది. బడీడు పిల్లలను గుర్తించేందుకు చేపట్టిన సర్వేలో భాగంగా అధికారులు పత్తి చేన్లు, తోటలు, భవన నిర్మాణాలు, వ్యాపార సముదాయాల వద్ద ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ దిశగా అక్కడి సీఆర్పీతో పాటు జిల్లా, మండల అధికారులు నేరుగా వెళ్లి అక్కడి పిల్లలను గుర్తించి వెంటనే సమీప ప్రభుత్వ పాఠశాలలకు తరలించి పేర్లు నమోదు చేయించారు.

మండలాల వారీగా బడిబయటి పిల్లల వివరాలు

మండలం	14ఏళ్లలోపు	15ఏళ్లకుపైగా..	మొత్తం
ఆసిఫాబాద్	27	5	32
బెజ్జూర్	30	12	42
చింతలమానెపల్లి	35	3	38
దహెగాం	26	26	52
జైనూర్	27	14	41
కాగజ్‌నగర్	71	60	131
కెరమెరి	10	1	11
కౌటాల	34	10	44
లింగాపూర్	13	6	19
పెంచికల్‌పేట్	17	6	23
రెబ్బెన	51	46	97
సిర్పూర్(టీ)	35	14	49
సిర్పూర్(యూ)	32	15	47
తిర్యాణి	35	12	47
వాంకిడి	39	13	52
మొత్తం	482	243	725

తల్లిదండ్రులు సహకరించాలి



చదువుకునే వయస్సు పిల్లలను పనులకు పంపడం చట్టరీత్యా నేరం. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు సహకరించాలి. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు గత నెల 11నుంచి ఈనెల 17వ తేదీ వరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహించాం. ఈ సర్వేలో 725 మంది బడిబయటి పిల్లలను గుర్తించి పలు పాఠశాలల్లో చేర్పించాం. బడిబయటి పిల్లలను మరింత మందిని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపడతాం.

– ఉప్పులేటి శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్

ముగిసిన ఐఎస్‌ఎల్ పోటీలు



ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న సోషల్ వెల్ఫేర్ సొసైటీ క్రీడాకారులు


ద్వితీయ స్థానంలో నిలిచిన స్టార్స్ క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న పీవో

- ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన సోషల్ వెల్ఫేర్ సొసైటీ
- ద్వితీయస్థానంలో నిలిచిన స్టార్స్ ట్రైబల్ వెల్ఫేర్ క్రీడాకారులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం కాంప్లెక్స్ ప్రాంగణంలో నాలుగు రోజులు నిర్వహిస్తున్న రాష్ట్ర 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడా పోటీలు శనివారంతో ముగిసాయి. హోరాహోరీగా జరిగిన పోటీల్లో సోషల్ వెల్ఫేర్ సొసైటీ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఓవరాల్ చాంపియన్లుగా, స్టార్స్ ట్రైబల్ వెల్ఫేర్ క్రీడాకారులు ద్వితీయస్థానంలో నిలిచారు. విజేత జట్లకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ క్రీడల విజయవంతానికి కృషి చేసిన ఐటీడీఏ పీవో, అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో సైతం ఇలాంటి క్రీడలు నిర్వహిస్తే అక్కడి క్రీడాకారులకు కూడా క్రీడలపై ఆసక్తి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా కారులు ఒకేచోట చేరి క్రీడల్లో తమ సత్తా చాటడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింతగా క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీడీ దిలీప్‌కుమార్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడలో

హాకీ అండర్–17 బాలికల విభాగంలో (ఏకలవ్య గురుకులం) ప్రథమస్థానం, టీటీడబ్ల్యూఆర్‌జేసీ ద్వితీయస్థానం, బాలుర విభాగంలో స్టార్ సొసైటీ ప్రథమస్థానం, బీసీ వెల్ఫేర్ ద్వితీయస్థానం, టీఎంఆర్ఎస్ తృతీయస్థానంలో నిలిచారు.

హ్యాండ్ బాల్ క్రీడలో..

హ్యాండ్ బాల్ అండర్–17 బాలుర విభాగంలో సోషల్ వెల్ఫేర్ సొసైటీ ప్రథమస్థానంలో, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ ద్వితీయస్థానంలో, బాలికల విభాగంలో స్టార్స్ సొసైటీ ప్రథమస్థానంలో, సోషల్ వెల్ఫేర్ ద్వితీయస్థానంలో నిలిచాయి.

ఫుట్ బాల్ క్రీడలో

ఫుట్ బాల్ అండర్–17 బాలుర విభాగంలో సోషల్ వెల్ఫేర్ ప్రథమస్థానంలో, ట్రైబల్ వెల్ఫేర్ ద్వితీయస్థానంలో బాలికల విభాగంలో సోషల్ వెల్ఫేర్ ప్రథమస్థానంలో, ట్రైబల్ వెల్ఫేర్ ద్వితీయస్థానంలో నిలిచాయి.

ఖోఖో క్రీడలో

ఖోఖో అండర్–17 బాలుర విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రథమస్థానంలో, స్టార్స్ సొసైటీ ద్వితీయస్థానంలో, బాలికల విభాగంలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం ప్రథమస్థానంలో, స్టార్స్ సొసైటీ ద్వితీయస్థానంలో నిలిచాయి. అండర్–14 బాలికల విభాగంలో స్టార్స్ సొసైటీ ప్రథమస్థానంలో, మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం ద్వితీయస్థానంలో నిలిచాయి. అండర్–14 బాలుర విభాగంలో స్టార్స్ సొసైటీ ప్రథమస్థానంలో, సోషల్ వెల్ఫేర్ ద్వితీయస్థానంలో నిలిచాయి.

క్లుప్తంగా

శివకృష్ణకు ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం


పురస్కారం అందుకుంటున్న శివకృష్ణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణను ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం వరించింది. శనివారం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌లో ప్రత్యేక కార్యక్రమంలో ఏరువాక ఫౌండేషన్ 2023 సంవత్సరానికి గానూ శివకృష్ణను ఉత్తమ శాస్త్రవేత్తగా ప్రకటించింది. మారుమూల గ్రామీణ ప్రాంత రైతుల అభివృద్ధికి చేస్తున్న కృషికి గానూ ఆర్గానిక్ ఫార్మర్, ఇంటర్నేషనల్ ప్లానెట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

అయోధ్యకు తరలిన కరసేవకుడు


అయోధ్యకు వెళ్తున్న సత్యనారాయణ దంపతులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ట కార్యక్రమానికి సిర్పూర్(టి)కి చెందిన కరసేవకుడు గంగు సత్యనారాయణశర్మ, గంగు కళ్యాణి దంపతులు శనివారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ నుండి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన కల నెరవేరుతున్నందుకు సంతోషాన్ని మాటల్లో చెప్పలేక పోతున్నామన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రాముని దర్శించుకుని రావడమే ఏకైక లక్ష్యమన్నారు. రామరాజ్యంలో ప్రజలందరు సుఖ సంతోషాలతో జీవించాలని రాముడిని వేడుకోనున్నట్లు తెలిపారు.

బెల్లంపల్లి ఆస్పత్రి పునరుద్ధరణకు చర్యలు


వినతిపత్రం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్ శనివారం సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌ను హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో అత్యంత పురాతనమైన బెల్లంపల్లి ఏరియాకు పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాలని, కార్మికులు, రిటైర్డు కార్మికులకు సేవలందించడానికి ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యులను, సరిపడా సిబ్బందిని నియమించాలని కోరారు. ఆయన వెంట నాయకులు సిద్దంశెట్టి రాజమొగిలి, పేరం శ్రీనివాస్, సోకాల శ్రీనివాస్, రాజం, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

ప్రమోషన్ పత్రాలు అందజేత


పత్రాలు అందిస్తున్న ఏజెంట్ రాముడు

శ్రీరాంపూర్: ఆర్కే న్యూటెక్ గనిలో పనిచేస్తున్న 29 మంది ఉద్యోగులకు శనివారం సర్వీస్ లింక్ ప్రమోషన్(ఎస్ఎల్పీ) పత్రాలు అందించారు. గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ మాలోతు రాముడు, మేనేజర్ స్వామి రాజు ఉద్యోగులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతతో పనిచేయాలన్నారు. పని స్థలాల్లో రక్షణతో పనిచేస్తూ ఉత్పత్తి ఉత్పాదకతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టే రమేశ్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, గని సంక్షేమాధికారి పాల్ సృజన్, అధికారులు శంకరయ్య, కృష్ణ, పిచ్చేశ్వరరావు, మిట్టపల్లి శ్రీనివాస్, సాత్విక్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆల్టర్నేట్ 11 మెన్ కమిటీ సభ్యుడిగా తిరుపతి


తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆల్టర్నేట్ 11 మెన్ కమిటీ సభ్యుడిగా బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన ఎస్.తిరుపతి ఎంపికయ్యారు. గోదావరిఖనిలో జరిగిన ఏఐటీయూసీ కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు.

16న బంద్ విజయవంతం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



మాట్లాడుతున్న భూపాల్

శ్రీరాంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ రంగ సంస్థలను ప్రోత్సహిస్తోందన్నారు. విద్యుత్ సంస్కరణల బిల్లు, కార్మిక చట్టాల సవరణ, నేషనల్ మానిటైజేషన్, జీఎస్టీ, తదితర చట్టాలు తీసుకువచ్చి బడుగు, బలహీన వర్గాల ఆస్తులను దోచి పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు రాయితీలు ఇస్తోందన్నారు. మత రాజకీయలు చేస్తూ దేశాన్ని విభజన చేస్తోందన్నారు. దేశ ప్రజలు నేడు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని బీజేపీ ప్రభుత్వం మాత్రం దేశం వికసిస్తుందంటూ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. అన్నివర్గాల ప్రజలు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జే.అశోక్. నాయకులు జీ.అశోక్, నగేష్, బుచ్చన్న, సమ్మక్క, శోభ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు మోర్ల దేవాజీ

నెన్నెల(భీమిని): రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన భీమిని మండలంలో చోటు చేసుకుంది. తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన నాంచర్ల సత్తన్న, నాంచర్ల అశోక్ శనివారం ద్విచక్ర వాహనంపై భీమిని మండల కేంద్రంలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. భీమిని మండల కేంద్రానికి చెందిన మోర్ల దేవాజీ మండల కేంద్రం నుంచి లక్ష్మీపూర్ వైపు వెళ్తుండగా మూలమలుపు వద్ద ఉన్న మహాదేవ్‌తలాబ్ వద్ద ఎదురెదురుగా ఇరువురి బైక్‌లు ఢీకొన్నాయి. ఘటనలో ముగ్గురికి గాయాలు కావడంతో 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాంచర్ల అశోక్ పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై భీమిని ఎస్సై ప్రశాంత్‌ను సంప్రదించగా సంఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


బాపులాల్ మృతదేహం

లక్సెట్టిపేట: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చందారం గ్రామానికి చెందిన బాపులాల్ (40)కు ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత అతని భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. మళ్లీ వివాహం చేసుకోవడంతో మళ్లీ ఇద్దరు సంతానం కలిగారు. కుటుంబ పోషణకు ఇబ్బందులు ఏర్పడడంతో సుమారు రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గతుకుల రోడ్డుపై బతుకులు ఆగమే..

- అర్ధరాత్రి అడవిలో ప్రవసం
- పురుడు పోసిన 108 సిబ్బంది


నవజాత శిశువుతో 108 సిబ్బంది

వేమనపల్లి: అర్ధరాత్రి 108 సిబ్బంది అరణ్య మార్గంలో ఓ గర్భిణికి పురుడు పోశారు. మండలంలోని జాజులపేట గ్రామానికి చెందిన పూజితకు అర్ధరాత్రి పురుటినొప్పులు ప్రారంభమయ్యాయి. 108కు ఫోన్ చేయగా ఈఎంటీ రమేశ్, పైలెట్ ముజామిల్ గ్రామానికి వెళ్లి అంబులెన్స్‌లోకి ఎక్కించారు. నిబంధనల ప్రకారం సిబ్బంది వేమనపల్లి పీహెచ్‌సీకి తరలించేందుకు సిద్ధమయ్యారు. కుటుంబ సభ్యులు తాము పీహెచ్‌సీకి రాలేమని చెన్నూర్‌కు వెళ్దామని కోరారు.

ఆరు కిలోమీటర్లు అడుగుకో గుంత :

నీల్వాయి వాగు వంతెన అప్రోచ్‌రోడ్డు నుంచి మల్లంపేట వరకు ఆరు కిలోమీటర్లు రోడ్డు మార్గం గుంతలమయమై ఉంది. అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా కుదుపులకు మార్గమధ్యలో అడవిలోనే నొప్పులు ఎక్కువయ్యాయి. చేసేదేంలేక పైలెట్ వాహనాన్ని పక్కకు ఆపగా ఈఎంటీ రమేష్ ప్రసవం కోసం వైద్యం మొదలుపెట్టాడు. శిశువు తల బొడ్డుతాడు ఉండటంతో అధైర్యపడకుండా వైద్యుడిని ఫోన్ ద్వారా సంప్రదించి సుఖ ప్రసవం అయ్యేలా చేయడంతో పండంటి మగబిడ్డకు జన్మనివ్వగా చెన్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి


బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ పార్థసారథి, కలెక్టర్ బి. సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్


కలెక్టర్ సంతోష్‌ను సన్మానిస్తున్న ఎన్నికల కమిషనర్ పార్థసారథి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఏ రంగంలో అయినా అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, వినూత్న ఆలోచన, క్రమశిక్షణతో సృజనాత్మకతను జోడించి ఎన్నో సృష్టించవచ్చని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారధి అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సినీ, టీవీ దర్శకులు, రచయితల శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దర్శకులు, రచయితలు ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయికి ఎదగడం మనకు గర్వకారణమన్నారు. శిక్షణ శిబిరం రచయితలు, దర్శకులు, క్షేత్రస్థాయి ఔత్సాహికులకు సువర్ణావకాశమన్నారు. గతంలో హైదరాబాద్‌లో మాత్రమే నిర్వహించే ఈ శిక్షణ శిబిరాలు జిల్లాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఈ శిబిరం సినీ, టీవీ రచయితలు, దర్శకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాలు, సింగరేణి బొగ్గు గనులు, అటవీ ప్రాంతం, ఆహ్లాదకరమైన గాంధారివనం, గాంధారిఖిల్లా లాంటి చారిత్రక ప్రాంతాలు షూటింగ్ స్పాట్లుగా ఉన్నాయన్నారు. అనంతరం ఐలమ్మ డాక్యుమెంటరీ చిత్రాన్ని విడుదల చేశారు. తెలంగాణ బుక్, తెలంగాణ ఓరుగల్లు, తెలంగాణ క్విట్ ఇండియా, తెలంగాణ కోర్సు బుక్‌లెట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, తెలుగు సినీ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి వీయస్.ఆదిత్య, తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల, డి.సురేష్‌కుమార్, వీవీకే హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ విజయ్‌కుమార్, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం అధ్యక్షుడు శ్రీశైలమూర్తి, ఆర్ ప్రేమ్ రాజ్, హనుమాండ్ల మధు, జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కొమ్మెర విశ్వేశ్వరశర్మ, ప్రధాన కార్యదర్శి అంతడుపుల నాగరాజు, టీవీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కక్ర నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చర్చల ప్రతినిధులుగా ముగ్గురికి అవకాశం

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీలో కార్పొరేట్ చర్చల ప్రతినిధులుగా శ్రీరాంపూర్ నుంచి ముగ్గురు నేతలకు అవకాశం కల్పించారు. శనివారం గోదావరిఖనిలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య అధ్యక్షతన యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఉన్నత స్థాయిలో యాజమాన్యంతో జరిపే చర్చల్లో పాల్గొనబోయే ప్రతినిధులుగా శ్రీరాంపూర్ నుంచి ఆ యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రెటరీలు ముస్కె సమ్మయ్య, కే.వీరభద్రయ్య, ఆల్టర్నేటివ్ చర్చల ప్రతినిధిగా ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదాను నియమించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలో విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలో బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించి ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పుల్లూరి దీపక్, నగమల్ల గణేశ్, గొల్ల బలరాముడు, గడపల సుమేధ్, మత్తుల మధు, బండారి శివమూర్తి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. గతేడాది డిసెంబర్ 24న దేశ వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ గురుకులాల నుంచి 1,623 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో సంక్షేమ గురుకులాల నుంచి 52 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు ఎంపిక కాగా ఇందులో బెల్లంపల్లి విద్యార్థులు ఆరుగురు ఉండడం విశేషం. విద్యార్థుల ఎంపిక పట్ల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్సీవో కొప్పుల స్వరూపారాణి హర్షం వ్యక్తం చేశారు.

గంగాపూర్ జాతరకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ఏర్పాట్లపై సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: గంగాపూర్ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. రెబ్బెన మండలం గంగాపూర్‌లో ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చాంబర్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పారిశుధ్యం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని సూచించారు. తాగునీటి సమస్య రాకుండా మిషన్ భగీరథ అధికారులు చొరవ తీసుకోవాలని, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో దర్శనం క్యూలైన్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణను గ్రామపంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, జాతరలో తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేసేలా మండల పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటపతి, రెబ్బెన తహసీల్దార్ సమీర్ అహ్మద్, రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ సభ్యుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలి


రైతులకు చెక్కులు అందజేస్తున్న నీరజ్‌కుమార్

పెంచికల్‌పేట్: వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ సూచించారు. పులి దాడిలో పశువులు మృతి చెందగా యజమానులకు అటవీశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం పరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పులి దాడిలో పశువులు మృతి చెందితే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పులి దాడిలో పశువు మృతి చెందితే తక్షణసాయంగా రూ.5వేలు, పశువైద్యాధికారి పంచనామా తర్వాత మిగతా నగదు అందజేస్తామని తెలిపారు. పంటల రక్షణ పేరుతో వన్యప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఎండలు సమీపిస్తున్న నేపథ్యంలో వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో గంగాసింగ్, పశువైద్యాధికారి రాకేశ్, ఎఫ్ఆర్వోలు దయానంద్, సుధాకర్, ఏఎస్సై ప్రభాకర్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌లో ఆసిఫాబాద్ విద్యార్థులు


పాల్గొన్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: హర్యానలో ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించిన సైన్స్ ఫెస్టివల్‌లో జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొని సర్టిఫికెట్ పొందినట్లు డీఈవో అశోక్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఫెస్టివల్స్‌తో విద్యార్థుల్లో ప్రయోగాత్మకంగా అభ్యసనాన్ని ప్రోత్సహిస్తుందని, కీలకమైన అంశాలను ప్రత్యేకించి చెప్పడానికి ఉపయోగపడుతుందన్నారు. పాల్గొన్న వారిలో ఇషికా సింగ్ (ఫాతిమా కాన్వెంట్ స్కూల్, కాగజ్ నగర్), ప్రవళిక (కేజీబీవీ, దహెగాం), మనీషా (కేజీబీవీ, కాగజ్‌నగర్), కౌశిక్, (రాసిమెట్ట హైస్కూల్), వర్షిత్ (మోడల్ స్కూల్, ఆసిఫాబాద్) ఉన్నారు.